# నీళ్లు నిలుస్తున్న ఖాళీ స్థలాలను గుర్తించండి



నగరంలో పర్యటిస్తున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్

వాటిని శుభ్రం చేసేలా యజమానులకు నోటీసులివ్వండి

డివిజన్ల పర్యటనలో కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆదేశాలు

ఖమ్మం, జూలై 12 : నగరంలో వర్షపు నీరు, వరద నీరు నిలుస్తున్న ఖాళీ స్థలాలను గుర్తించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ సూచించారు. దోమలు వ్యాప్తిచెందకుండా వాటిని వెంటనే శుభ్రం చేసేలా ఆయా స్థలాల యజమానులకు నోటీసులివ్వాలని ఆదేశించారు. ఆ నోటీసులకు వారు స్పందించకుంటే మున్సిపల్ సిబ్బందితో ఆయా స్థలాలను శుభ్రం చేయించాలని, అందుకు అయిన రుసుమును ఆయా స్థలాల యజమానుల వద్ద వసూలు చేయాలని ఆదేశించారు. ఖమ్మం నగరంలోని 2, 4, 13 డివిజన్లలో శుక్రవారం పర్యటించిన ఆయన.. కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌తో కలిసి ఆయా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందితో మాట్లాడారు. అన్ని డివిజన్లలోనూ వరద నీళ్లు, మురుగు నీళ్లు నిలిచే ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. అవసరమైతే నీళ్లు నిలిచే ప్రాంతాల్లో కల్వర్టులు నిర్మించాలని ఆదేశించారు. వర్షాకాలం అయినందున ఎక్కువమంది సిబ్బంది కేటాయించి కాలువల్లో పూడికలు తీయించాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్, ఈఈ కృష్ణలాల్, డీఈ ధరణి, ఏఈ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ఖమ్మం నగర ప్రజలందరూ తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ సూచించారు. డ్రైడే ఫ్రైడేలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో మున్సిపల్, వైద్య సిబ్బంది చేపట్టిన కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామన్నపేట, రోటరీనగర్ ప్రాంతాల్లో డెంగీ కేసులు వచ్చినందున ఇతర ప్రాంతాల ప్రజలు కూడా అప్రమత్తం కావాలన్నారు. తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని, గుంతలేమైనా ఉంటే వాటిని పూడ్చాలని సూచించారు. ఇంటి చుట్టూ పిచ్చిమొక్కలు లేకుండా శుభ్రపర్చుకోవాలన్నారు. ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, కూలర్లు, సీసాలు, కుండలు, గాబుల్లో నీళ్లను పారబోస్తే వాటిల్లో దోమలు చేసే అవకాశం ఉండదని వివరించారు.

# పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఖమ్మం రూరల్, జూలై 12 : ఆశ్రమ పాఠశాలలో సదుపాయాలు కల్పించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ అన్నారు. శుక్రవారం గొల్లగూడెం గ్రామంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. 432 మంది విద్యార్థినులకు భవనం సరిపోవడం లేదని, అదనపు గదుల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రత పాటించాలని, పాఠశాల ఆవరణలో నీరు నిల్వకుండా చూడాలని, దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. భోజనం, బోధన గూర్చి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి విజయలక్ష్మి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బీ మాలతి, ట్రైకార్ నోడల్ అధికారి శంకర్‌రావు, సహాయ గిరిజన సంక్షేమ అధికారి జహీరుద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, గిరిజన సంక్షేమశాఖ డీఈ రాజు, వార్డెన్ రమాకుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పాఠశాలను తనిఖీ చేసి, వివరాలు తెలుసుకుంటున్న హుస్సేన్‌నాయక్

# 'స్తంభాద్రి' ఆసుపత్రిలో.. బ్రెయిన్ ట్యూమర్ చికిత్స విజయవంతం

రఘునాథపాలెం, జూలై 12: ఖమ్మం నెహ్రూనగర్‌లోని స్తంభాద్రి హాస్పిటల్‌లో 85 ఏళ్ల వృద్ధురాలికి నిర్వహించిన బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్స విజయవంతమైనట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఆసుపత్రిలో శుక్రవారం వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లాకు చెందిన లక్ష్మి అనే వృద్ధురాలు ఇటీవల అపస్మారకస్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు ఆమెను ఖమ్మంలోని స్తంభాద్రి ఆసుపత్రిలో చేర్చారు. పలు పరీక్షలు చేసిన ఆసుపత్రి వైద్యులు.. మెదడులో పెద్ద సైజులో గడ్డ ఉండడాన్ని గుర్తించారు. ఆ వ్యాధిని స్టిరాయిడ్ వింగ్ మెరిజోమోగా నిర్ధారించారు. ఆసుపత్రి న్యూరోసర్జన్ డాక్టర్ గట్టినేని సురేశ్.. ఆమెకు శస్త్రచికిత్స చేసి ఆ ట్యూమర్‌ను విజయవంతంగా తొలగించారు. కేవలం హైదరాబాద్, బెంగళూరులోని పెద్ద పెద్ద ఆసుపత్రులకే పరిమితమైన ఈ శస్త్రచికిత్సను అతి తక్కువ ఖర్చుతో ఖమ్మంలోని తమ ఆసుపత్రిలో నిర్వహించినట్లు డాక్టర్ గట్టినేని సురేశ్ తెలిపారు. సర్జరీ అనంతరం కోలుకున్న రోగి లక్ష్మిని శుక్రవారం డిశ్చార్జ్ చేసి సురక్షితంగా ఇంటికి పంపినట్లు తెలిపారు. గతంలోనూ తాము అనేక హైరిస్క్ సర్జరీలు చేసినట్లు వివరించారు.



బ్రెయిన్ ట్యూమర్ చికిత్స చేయించుకున్న వృద్ధురాలితో డాక్టర్ గట్టినేని సురేశ్

### నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌లకు 45 మంది విద్యార్థులు ఎంపిక

సత్తుపల్లిటౌన్, జూలై 12: ఇంటర్ బోర్డు ప్రకటించిన 2024 విద్యా సంవత్సరానికి గాను నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు సత్తుపల్లికు చెందిన శ్రీవాణి బాలికల కళాశాల విద్యార్థులు 45 మంది అర్హత సాధించారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ పాల ప్రవీణ్‌రెడ్డి, యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

### సొసైటీ డైరెక్టర్ మృతి

కొణిజర్ల, జూలై 12: మండలంలోని అమ్మపాలెం గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు, సొసైటీ డైరెక్టర్ గుణగంటి లక్ష్మీనారాయణ గురువారం రాత్రి క్యాన్సర్ వ్యాధితో మృతిచెందారు. ఆయన మృతిపట్ల పలుపార్టీల నాయకులు సంతాసం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# జల్లేపల్లిలో తగ్గని విషజ్వరాలు

- ప్రతి ఇంట్లోనూ ఒక్కరిద్దరు బాధితులు
- డెంగీ బారిన 30 మంది.. టైఫాయిడ్‌తో ఐదుగురు
- తూతూమంత్రంగా పారిశుధ్య కార్యక్రమాలు

తిరుమలాయపాలెం, జూలై 12 : మండలంలోని జల్లేపల్లి గ్రామంలో నెలరోజులుగా ప్రజలు జ్వరాలతో సతమతమవుతున్నారు. గ్రామంలో ఏ ఇంట్లో చూసినా ఇద్దరు ముగ్గురు బాధితులు కనిపిస్తున్నారు. తగ్గేవారికి జ్వరం తగ్గితే ఇంట్లో కొత్త వారికి జ్వరం సోకుతున్నది. గ్రామంలో ఇప్పటివరకు 750 మందికి పైగానే జ్వరాలు వచ్చినట్లు వైద్యశాఖాధికారులే చెబుతున్నారు. ఇప్పటికి సుమారు 200 మంది గ్రామంలో ప్రతి ఇంట్లో జ్వరపీడితులే కనిపిస్తున్నారు. గ్రామంలో ప్రభుత్వ లెక్కల ప్రకారం 30 మందికి డెంగీ, ఐదుగురుకి టైఫాయిడ్ ధ్రువీకరణ అయ్యింది. అనధికారికంగా ఈ సంఖ్య ఇంకా అధికమనే చెప్పవచ్చు. తూతూమంత్రంగా అందుతున్న ప్రభుత్వ వైద్యానికి సంతృప్తి చెందని జ్వరపీడితులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.వేలకు వేలు ఖర్చుచేసి అప్పులపాలవుతున్నారు.

### మురికికూపంగా మారిన వీధులు

జల్లేపల్లిలో ప్రజలు జ్వరాల బారినపడడానికి పారిశుధ్య లోపమే ప్రధాన కారణంగా చెప్పవచ్చు. దళితకానీలు, ఎస్టీ కాలనీల్లో ఏ వీధి చూసినా మురికికూపంగా మారింది. కొన్ని వీధుల్లో డ్రైన్లు లేక వర్షపు నీరు వీధుల్లో నిలుస్తున్నది. మరికొన్ని వీధుల్లో సైడు కాల్వల్లో చెత్తచెదారం పేరుకపోయి మురికినీరు సరఫరా నిలిచిపోయింది. సైడు కాల్వల్లో పేరుకపోయిన పూడిక మట్టిని తొలిగించలేదు. ఎస్టీ కాలనీలో ఇళ్ల మధ్యలో ఓ పెద్ద పాడుబడిన బావి ఉంది. ఆ బావి దోమలకు నిలయంగా మారింది. ఇళ్లలో ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించని కారణంగా కూడా జ్వరాలబారిన పడుతున్నారు. ఇదిలాఉంటే అధికారులు గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. స్పెషల్‌డ్రైవ్ చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పించామని ఏఎన్ఎం నాగమణి చెబుతుండగా.. పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నామని పంచాయతీ కార్యదర్శి ధనమ్మ చెప్పారు. ఏదేమైనా గ్రామంలో తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



జల్లేపల్లిలో పారిశుధ్య లోపానికి నిలువెత్తు నిదర్శనాలు



ఆసుపత్రికి వెళ్లేందుకు ఆటో కోసం ఎదురుచూస్తున్న జల్లేపల్లి గ్రామస్తులు

#### ఊరుని పట్టించుకున్నోరే లేరు..



ఇంటికి ఇద్దరు ముగ్గురు జ్వరాలతో మంచానపడినా ఊరును పట్టించుకున్న నాథుడే లేడు. అధికారులు వస్తున్నరు.. పోతున్నరు.. అక్కడక్కడ బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నరు. దోమలు మందు కూడా సక్రమంగా కొట్టడం లేదు. చాలా ఏళ్లుగా సైడు కాల్వలను తీసినోడే లేడు. పెద్దసార్లు పట్టించుకొని మా ఊరుని బాగుచేయాలి.

\- అన్నెపర్తి ఉప్పలమ్మ, గ్రామస్తురాలు

#### పౌడరు చల్లడంలే మందు కొట్టడంలేదు



మా బజారులో మురికికాల్వలు పూడిపోయాయి. దాంట్లో పారెడు మట్టి తీసినోడు లేడు. దోమలమందు కూడా కొట్టినోరు లేరు. వర్షాలు పడినప్పటి నుంచి దోమలతో చచ్చిపోతున్నం. జ్వరాల వచ్చినోళ్లు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ అప్పులపాలు అవుతున్నారు.

\- చిర్రా ఎల్లమ్మ, గ్రామస్తురాలు

## ఇన్ఫోసిస్‌ను సందర్శించిన ప్రియదర్శిని విద్యార్థులు



ఇన్ఫోసిస్ కంపెనీలో ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు

ఖమ్మం రూరల్, జూలై 12 : మండల పరిధిలోని ప్రియదర్శిని మహిళా సాంకేతిక కళాశాల బీసీఏ విద్యార్థినులు శుక్రవారం టాస్క్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రముఖ బహుళ జాతి సంస్థ ఇన్ఫోసిస్‌ను సందర్శించినట్లు కళాశాల చైర్మన్ కాట్రెపల్లి నవీన్ తెలిపారు. కళాశాలకు చెందిన 86 మంది విద్యార్థినులకు సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, సిమ్రాన్ అవగాహన కల్పించినట్లు తెలిపారు. అవకాశాన్ని కల్పించిన టాస్క్ మేనేజర్ దినేష్, ప్రతినిధులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీ గోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు టెక్నాలజీ రంగంలో తాజా పరిణామాలను తెలుసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం కే.సంధ్యారాణి, వైవీ రాణి, శైలజ పాల్గొన్నారు.

# సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలి

వేంసూరు, జూలై 12: వేంసూరులోని ప్రగతినగర్‌లో గల డబుల్ బెడ్రూం కాలనీలో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం రోడ్లపై నాట్లు వేసి నిరసన తెలిపారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్లు బురదమయమై ద్విచక్ర వాహనాలు, ఆటోలు కానీ కనీసం నడవడానికి కూడా అవకాశం లేక నానా ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ అన్నారు. ప్రజల ఇబ్బందులు, సమస్యలు పట్టించకోకుండా అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కే రంజాన్‌బీ, కిన్నెర మారయ్య, ఎస్‌కే హమీద్, లాల్‌మొహమ్మద్, సంతోష్, శ్రీలత, ఎస్‌కే బాజీ, కృష్ణమ్మ, తిరుపతిరావు, నాగూర్‌బీ, సుప్రియ, యాకోబు, ప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మూతపడిన అజ్మీరాతండా ప్రాథమిక పాఠశాల

# మూతబడిన ప్రభుత్వ పాఠశాలలు

తిరుమలాయపాలెం, జూలై 12 : చదువు చెప్పే ఉపాధ్యాయులు లేకపోవడంతో మండలంలో ఐదు మండల పరిషత్ ప్రభుత్వ పాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. రాష్ట్రంలో ఏఒక్క ప్రభుత్వ పాఠశాల మూతపడడానికి వీలులేదని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు చెబుతున్న విషయం విదితమే. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. తిరుమలాయపాలెం మండలంలోని పడమటితండా పంచాయతీ శివారు రావిచెట్టుతండా, ఏనుకుంటతండా గ్రామపంచాయతీ శివారు నాయకన్‌తండా, పైనంపల్లి గ్రామపంచాయతీ శివారు వాంకుడోత్‌తండా, అజ్మీరాతండా, మంగళిబండతండాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు తెరుచుకోవడం లేవు. ఈ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ పాఠశాలలు సుదూరంగా ఉండడంతో ఇక్కడికి బదిలీపై రావడానికి ఉపాధ్యాయులు చొరవ చూపడం లేదు. దీంతో పాఠశాలలు మూతపడ్డాయి. ఈ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలను గత్యంతరం లేక వారి తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఈ విషయమై ఎంఈవో రమాచారిని వివరణ కోరగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పిల్లలు లేని పాఠశాలలను మూసివేసినట్లు చెప్పారు.

## నోట్‌బుక్స్ పంపిణీ



కూసుమంచి, జూలై 12 : సామాజిక సేవా కార్యక్రమాల్లో ఉండే తృప్తి అనిర్వచనీయమని తహసీల్దార్ సురేశ్‌కుమార్ అన్నారు. నాయకన్‌గూడెం పాఠశాలలో శుక్రవారం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానాల్లో ఉండాలన్నారు. కార్యక్రమంలో వరగాని లక్ష్మీనారాయణ, వేలాద్రి నర్సింహారావు, కందిబండ వెంకన్న, లింగారెడ్డి, గోళ్ల రంగయ్య, స్వర్ణకుమారి పాల్గొన్నారు.

**ప్రకటన**

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **ఖమ్మం బ్రాంచ్-1** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూల్ చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **బానోతు పూజ,** W/o : **రమేష్, వయస్సు** : 33 సం||లు, **వృత్తి** : గృహిణి, **నివాసం** : ఇ.నెం. 1-90, కాకరవాయి ఎనకుంటతండ గ్రామము, తిరుమలాయపాలెం మండలము, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లైములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

**షెడ్యూలు ఆస్తి :** ఖమ్మం జిల్లా అష్యూరెన్సుల రిజిస్ట్రారు మరియు కూసుమంచి సబ్ రిజిస్ట్రారు వారి అధికార పరిధిలోని, ఖమ్మం జిల్లా, తిరుమలాయపాలెం రెవిన్యూ మండలము, కాకరవాయి రెవిన్యూ గ్రామ పంచాయితి పరిధిలోని, ఎనకుంట తండ గ్రామ పంచాయితీ పరిధిలోని, ఎనకుంట తండ గ్రామ కంఠమునందు గల ఇ.నెం. 1-90 (Assessment No. 112)నకు చెందిన R.C.C. Roof గా గల గృహము మరియు సంబంధిత ఖాళీ స్థలంగా గల విస్తీర్ణం 149-43 చ||గ|| = 124-94 చ||మీ|| నిర్మాణ వైశాల్యం R.C.C. Roof House (Inc.Toilet) : 494-90 Sq.Fts. మరియు అందుగల సమస్త ఫిక్చర్స్, ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్, శానిటరీ సహితముగా **డాక్యుమెంట్ నెం. 2544/2024** గల స్థిరాస్తినకు హద్దులు : **తూర్పు:** గ్రామ పంచాయితీ రోడ్డు, **పడమర** : బీల్యా గారి గృహము, **ఉత్తరం** : గ్రామ పంచాయితీ రోడ్డు, **దక్షిణం** : బి.మల్సూర్ గారి గృహము.

**జి.హరేందర్ రెడ్డి**
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

### సంక్షిప్తం

### విజయలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

కొణిజర్ల, జూలై 12: మండలంలోని అమ్మపాలెంలో గల విజయ ఇంజినీరింగ్ కళాశాలలో 'విన్సూన్ గ్లోబల్ టెక్నాలజీ, కిట్స్ కార్ట ఇన్నోవేషన్స్' సంయుక్తంగా ఆన్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను కోర్ బ్రాంచెస్ ఈసీఈ, ఈఈఈ విద్యార్థులకు శుక్రవారం నిర్వహించారు. ఫాక్స్‌కాన్ అంపెనోల్, ఇండోమిమ్ సంస్థల్లో 35 మంది విద్యార్థులకు ఆఫర్ లెటర్ అందజేశారు. విన్సూస్ గ్లోబల్ టెక్నాలజీ హెచ్‌ఆర్ బీ.సురేష్, కిట్స్ కార్ట్ ఇన్నోవేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జీ సూర్యప్రకాశ్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. విద్యార్థులకు ఉద్యోగ అవకాశం కల్పించడం పట్ల కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ అయేషాతరుణం కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు కళాశాల వైస్‌చైర్‌పర్సన్ పీ.విజయలక్ష్మీ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్ బాబు, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ వీ.చిన్నయ్య, డీన్ డాక్టర్ డీ.శ్రీనివాసరావు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సత్తుపల్లి, జూలై 12: మండలంలోని గౌరిగూడెం 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు నిమిత్తం సబ్‌స్టేషన పరిధిలోని గౌరిగూడెం, కొత్తూరు, రేజర్ల, సర్వరాయ, రాజీవ్‌నగర్ గ్రామాల్లో శనివారం ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామరి విద్యుత్ ఏఈ శరత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పెనుబల్లి, జూలై 12: 33/11 కేవీ పెనుబల్లి విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతులు దృష్ట్యా శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పెనుబల్లి, వీఎం బంజర, రామచంద్రారావుబంజర, ఎడ్లబంజర, రంగారావుబంజర, సీతారాంపురం, టేకులపల్లి, బయ్యన్నగూడెం, నాయకులగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్‌శాఖ ఏఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మామిళ్లగూడెం, జూలై 12: ఖమ్మం నగరంలోని అన్ని సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎన్‌పీడీసీఎల్ ఖమ్మం డివిజన్ డీఈఈ రామారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మంలోని 132/33 కేవీ సబ్ స్టేషన్ల మరమ్మతుల కారణంగా బుర్హాన్‌పురం, రాపర్తినగర్, ఎన్‌ఎస్‌పీ క్యాంపు, దానవాయిగూడెం, గాంధీచౌక్, ప్రకాశ్‌నగర్, ఇల్లెందు క్రాస్ రోడ్డు, ప్రభుత్వ ఆసుపత్రి ఏరియా, ఖానాపురం హవేలీ పారిశ్రామిక ప్రాంతాల పరిధిలోని ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### నిత్యావసర సరుకులు అందజేత

కారేపల్లి, జూలై 12: పారిశుధ్య కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మైనార్టీ సెల్ నాయకుడు ఎస్‌కే గౌసుద్దీన్ శుక్రవారం నిత్యవసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు దిండు లచ్చయ్య, బోళ్ల కొమరయ్య, సుల్తాన్, యాదగిరి, ఉమా, పద్మ, శ్రీను, తిరుపతయ్య, గౌతమ్, అచ్చయ్య పాల్గొన్నారు.

### పాఠశాలకు బీరువా వితరణ

కారేపల్లి, జూలై 12: మండలంలోని విశ్వనాథపల్లి హైస్కూల్‌కు ఎన్ఆర్ఐ చెరుకూరి వేణుమాధవ్ రెండు బీరువాలను వితరణ చేశారు. వీటిని గ్రామస్తులు శుక్రవారం హెచ్ఎం పద్మకు అందజేశారు. కారేపల్లి క్రాస్‌రోడ్డు ప్రయాణికుల సౌకర్యార్థం రూ.3 లక్షల వ్యయంతో బస్‌షెల్టర్ నిర్మించి బల్లాలు ఏర్పాటు చేయించారు. గ్రామపెద్దలు మేదరమెట్ల ప్రేమ్‌కుమార్, తాతా వెంకటేశ్వర్లు, తాతా రవికుమార్, హెచ్ఎం పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులకు సన్మానం

ఖమ్మంరూరల్, జూలై 12 : ఉద్యోగోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న పలువురు ఉపాధ్యాయులను ఆయా పాఠశాలల్లో శుక్రవారం సన్మానించారు. జలగంనగర్ ఉన్నతపాఠశాలలో సునీలరాణి, పద్మావతి, మాధవిలత, మీరాబి, పీఈటీ రాజును సన్మానించారు. అదేవిధంగా ఇతర పాఠశాలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. మండల విద్యాశాఖ అధికారి ఎం.శ్యాంసన్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడిన టీచర్లను విద్యార్థులు ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకుంటారని అన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు ఆదిలక్ష్మి, శైలజ, సాజిదబేగం పాల్గొన్నారు.

మధిర, జూలై 12 : మధిర ఎంప్లాయిస్‌కాలనీ ప్రాథమిక పాఠశాలలో జంగం వసంతరాణిని హెచ్ఎం ప్రభాకర్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆమెతోపాటు మరికొంతమంది ఉపాధ్యాయులను సన్మానించారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చింతకాని, జూలై 12 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన బి.వెంకటేశ్వర్లు(48) ఖమ్మంలోని ఓ ప్రైవేటు దవాఖానాలో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ నిత్యం వెళ్లి వస్తున్నాడు. ఈ నెల 10వ తేదీన ఖమ్మం నుంచి గ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తున్న క్రమంలో అదుపుతప్పి రోడ్డుపై పడిపోగా తలకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించగా పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. మృతుడి భార్య అనసూయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఫ్యాన్ రెక్కలు తగిలి వ్యక్తి మృతి

కారేపల్లి, జూలై 12: ఫ్యాన్ రెక్కలు తగిలి వ్యక్తి మృతిచెందిన ఘటన కారేపల్లి మండలం సూర్యతండాలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యతండాకు చెందిన జర్పుల శంకర్ (55) రైల్వే పనిచేస్తుంటారు. శుక్రవారం కూలీ పని వెళ్లివచ్చిన అలసటతో ఇంట్లో ఫ్యాన్ వేసుకొని పడుకుంటుండగా ప్రమాదశాత్తు ఫ్యాన్ రెక్కలు మెడకు తగలడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఇంట్లో ఫ్యాన్ తిరుగుతున్న చప్పుడు అవుతుండటంతో బంధువులు చూడగా మెడకు గాయమై మృతి చెంది ఉన్నాడు. భార్య ఈరి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎన్ రాజారాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి మువ్వా

సత్తుపల్లిటౌన్, జూలై 12: రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా మువ్వా విజయబాబు ఎంపికైన సందర్భంగా శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రాంసహాయం రఘురామిరెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, రాందాస్‌నాయక్‌తో కలిసి మువ్వా విజయబాబు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

### 'ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం'


బోనకల్లు, జూలై 12 : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటం చేస్తున్నామని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి వీ.రాంబాబు అన్నారు. శుక్రవారం సంఘం సభ్యత్వం, జనరల్ ఫండ్ క్యాంపెయిన్‌లో భాగంగా బోనకల్లు పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, స్కావెంజర్లను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సదాబాబు, ప్రీతం, రామకృష్ణ, గోపాలరావు, సౌభాగ్యలక్ష్మి, నిర్మలకుమారి, నరసింహారావు పాల్గొన్నారు.

## అసైన్డ్‌భూమి ఆక్రమణలు తొలగించాలి

కారేపల్లి, జూలై 12: మండలంలోని కమలాపురం రెవెన్యూ గ్రామ పరిధిలో పేదలకు చెందిన అసైన్డ్ భూమి ఆక్రమణలకు గురైందని, దానిని లబ్ధిదారులైన పేదలకు ఇవ్వాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కారేపల్లి వైఎస్ఎస్ గార్డెన్‌లో జరిగిన అఖిలపక్ష సమావేశంలో నాయకులు మాట్లాడారు. కొందరు గిరిజ నేతరులు, పట్టాలున్నా గిరిజనులు అసైన్డ్‌భూమిని ఆక్రమించుకుంటున్నారన్నారు. అట్టి భూమిపై హక్కులున్న పేదలు వెళ్తే వారిపై దౌర్జన్యం చేస్తుండటంతో బాధితులు అఖిలపక్షాన్ని ఆశ్రయించారన్నారు. దీనిపై చర్చించిన అఖిలపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులు తహసీల్దార్ ఎస్.సురేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొండబోయిన నాగేశ్వరరావు, కే.నరేంద్ర, కాంగ్రెస్ నాయకులు తలారి చంద్రప్రకాశ్, ఎన్‌డీ నాయకులు వై.ప్రకాశ్, మాస్‌లైన్ నాయకులు గుగులోతు తేజానాయక్, బీఆర్ఎస్ నాయకులు మాజీసర్పంచ్ మాలోతు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

**TOURS & TRAVELS**



★ మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.

NT-339536

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

**ఒరిజినల్ సర్టిఫికెట్స్ పోయినవి**

**కొత్తపల్లి మమత,** D/o. కొత్తపల్లి రామదాసు, వయస్సు : 26సం||లు, నివాసం : ఇ.నెం. 1-66, నూతనకల్ గ్రామం, తల్లాడ మం||, ఖమ్మం జిల్లా. అను నేను ఖమ్మం పాత బస్టాండు నందు బాత్‌రూమ్‌కు వెళ్లగా నా ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్స్ పోయినవి. దొరికినవారు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.
**Cell: 95028 75314, 9705982608**

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్**

**వేలం కోసం బహిరంగ ప్రకటన -తాకట్టు బంగారు ఆభరణాల ఆస్తుల ఇ-వేలం కోసం బహిరంగ ప్రకటన**

దిగువ ఖాతాలలో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించిందని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటి నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (బంగారు రుణ సౌకర్యం) తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు/హామీదార్లను కోరుతూ రుణగ్రహీతలకు /హామీదార్లకు డిమాండ్ నోటీసులు జారీ చేశారు. అయితే రుణగ్రహీతలు/ హామీదార్లు బకాయి రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, తాకట్టు ఇన్‌వోక్ చేయుట బ్యాంక్‌కు తప్పనిసరి అయింది మరియు ఆస్తి షెడ్యూల్‌లో మరింతగా వివరించిన తాకట్టు బంగారు ఆభరణాలను '' ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే మరియు రీకోర్స్ పద్ధతి లేని విధంగా'' తేది: **23 జులై 2024**న మ. **12.30** గం. నుండి మ. **3.30** గం. మధ్య (ఇ-వేలం సమయం) ఇ-వేలం అమ్మకం నిర్వహించుటకు ప్రతిపాదించబడినది.

**రుణగ్రహీతలు & బకాయి మొత్తం వివరాలు:**

| క్ర.సం. | బ్రాంచ్ పేరు | రుణ A/c నం. | వినియోగదారు పేరు | బకాయి మొత్తం | డిమాండ్ నోటీస్ తేది | స్థూల బరువు | నికర బరువు |
|---|---|---|---|---|---|---|---|
| 1 | కొత్తగూడెం | xxxxxxxxxxxx1438 | బాలు వెంకటేశ్వర్లు | 49438 | 07 జూన్ 24 | 11.5 | 10.6 |
| 2 | ఖమ్మం | xxxxxxxxxxxx9410 | సంతటి ప్రభాసిని | 142255 | 07 జూన్ 24 | 32.8 | 31.4 |
| 3 | మధిర TG | xxxxxxxxxxxx3853 | హరి రామారావు | 354168 | 07 జూన్ 24 | 85.1 | 78.3 |
| 4 | ఖమ్మం | xxxxxxxxxxxx1212 | జడ వినయ్ కుమార్ | 117911 | 07 జూన్ 24 | 26.6 | 26 |
| 5 | సత్తుపల్లి | xxxxxxxxxxx6409 | గౌర శ్రీనివాస రావు | 126294 | 22 జూన్ 24 | 30.1 | 29.1 |
| 6 | పాల్వంచ TG | xxxxxxxxxxx5059 | బడవత్ ప్రవీణ్ నాయక్ | 40791 | 04 మే 24 | 10.65 | 10.43 |

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా ఖాతాను తొలగించుటకు/ వేలం తేదీని మార్చుటకు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్‌కు అథారిటీ కలదు. వేలం ఆన్‌లైన్‌లో **https://gold.samil.in** (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)లో మ. **12.30** గం. నుండి మ.**3.30** గం. మధ్య(సమయం) నిర్వహించబడును. సవివరమైన నియమ నిబంధనల కొరకు వెబ్‌సైట్ **https://gold.samil.in** (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)కు లాగిన్ కావలెను.

**అధీకృత అధికారి,యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్**

### కండక్టర్ వైరు చోరీ

వైరాటౌన్, జూలై 12: వైరాలోని మార్కెట్‌యార్డ్ ఎదురుగా ఉన్న రేకుల షెడ్డు గోదాములో సఖి ఎంటర్‌ప్రైజెస్ ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ నిల్వ ఉంచిన విద్యుత్ పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. గురువారం రాత్రి 8గంటల సమయంలో గోదాముకు వెనుక వైపు నుంచి టీఎస్ 04 యూబీ 0756 ట్రాలీ ఆటోలో ఓ దుండగుడు వచ్చి ఆవరణకు గోడగా ఉన్న రేకును తొలగించి లోపలి కెళ్లాడు. గోదాం తలుపుకు ఉన్న తాళం పగులగొట్టి సుమారు 250 కిలోల ట్రిబుల్ ఏ అల్యూమినియం కండక్టర్ వైరును అపహరించి ఆటోలో పరారయ్యాడు. అదే సమయంలో స్థానికులు కొంతమంది అతనిపై అనుమానం వచ్చి ప్రశ్నించగా అల్యూమినియం వైర్ కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్లు చెప్పాడు. సఖి ఎంటర్‌ప్రైజెస్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గోపినాథ్‌రెడ్డి, సైట్ ఇంజినీర్ వీరబాబు వైరా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

### 'కొత్త చట్టాల అమలుతో న్యాయ సంక్షోభం'

ఖమ్మం, జూలై 12: జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చిన నూతన నేర చట్టాలు వల్ల దేశంలో న్యాయ సంక్షోభం పెరిగిపోతుందని నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మురళీ కర్ణం అన్నారు. ఫలితంగా పౌర ప్రజాస్వామిక హక్కులు అణిచివేయబడతాయని అన్నారు. సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మంలో శుక్రవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఉభయ సభల్లో ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేసి నేర చట్టాలు ఆమోదింప చేశారని అన్నారు. సమగ్ర చర్చ, వివరణలు, విశ్లేషణలు లేకుండా ఈ కొత్త చట్టాలను అమలు చేస్తే అనేక ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని అన్నారు. సీనియర్ న్యాయవాది కొల్లి సత్యనారాయణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616